పాస్‌పోర్ట్ ఏజెంట్ల ఇళ్లలో సీబీఐ సోదాలు 7లో..

చివరి ఆయకట్టుకు సాగు నీరు అందిస్తాం 8లో..

పాఠశాలల్లో ఎన్నికల గంట

● నేడు బడి వారీగా షెడ్యూల్ విడుదల ● 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక

జగిత్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు నగారా మోగింది. విద్యాలయాల అభివృద్ధిలో తల్లి దండ్రుల భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రస్తుత ఎస్‌ఎంసీల గడువు ముగి యడంతో నూతన కమిటీల ఏర్పాటుకు ఈనెల 29న అన్ని రకాల ప్రభు త్వ పాఠశాలల్లో (ప్రభుత్వ, లోకల్ బాడీ, సంక్షేమ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్) ఎస్‌ఎంసీ ఎన్నికలు జరపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవ సేన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఎన్నికల్లో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువు తున్న విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు అవకాశం కల్పిస్తారు. ఈ ఎన్నికలను ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఎన్నికలకు 50 శాతం తల్లిదండ్రులు లేదా సంరక్షకులు హాజరై కోరం ఉండేలా చూసుకోవాలి. ఎన్నికలు చేయెత్తే ప్రక్రియ లేదా..వాయిస్ ఓటు ద్వా రా నిర్వహించే అవకాశాలున్నాయి.

ఈ నెల 20న షెడ్యూల్...

ఈ నెల 20న ఎస్‌ఎంసీ ఎన్నిక నోటిఫికేషన్ పాఠశాలల వారిగా వెలు వడనుంది. పాఠశాలల వారిగా తల్లిదండ్రుల జాబితాను ప్రదర్శిస్తారు. ఈ నెల 22వ తేదీ వరకు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 24న అభ్యంతరాలు స్వీకరణ పరిశీలన తదుపరి విద్యార్థులు, తల్లిదండ్రుల తుది జాబితా ప్రదర్శన జరుపుతారు. ఈనెల 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎన్నిక నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య ఎస్‌ఎంసీ తొలి సమావేశం నిర్వహిస్తారు.

ఎన్నుకునే విధానం ఇలా...

జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఆశ్రమ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, యూఆర్ఎస్, మోడల్ పాఠశాలల్లో నిబంధనల ప్రకారం ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. ప్రాథమిక పాఠశాలల్లో 10, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 14, ఉన్నత పాఠశాలల్లో 10 మంది సభ్యులతో కమిటీలను ఎన్నుకుంటారు.



పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగుతాయి. ఆరుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులుంటారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల నిర్వ హణలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో విద్యా హక్కు చట్టం ఎస్‌ఎంసీలను ఏర్పాటుకు మొగ్గు చూపింది. సదరు పాఠశాలలో చదివే తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. రెండేళ్ల పాటు పదవిలో ఉంటారు. ఎప్పుడైనా వారి పిల్లలు పాఠశాలను వదిలి వెళితే పదవి కోల్పోతారు. ఓటర్ల జాబితాల్లోని తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుల్లో ఒకరే ఓటు వినియోగించుకోవడానికి అర్హులు. ఓటర్లలో 50 శాతం మంది హాజరుకాకపోతే కోరం లేనట్లుగా పరిగణించాల్సి ఉంటుంది. సభ్యులు చేతులెత్తే పద్ధతి ద్వారా గానీ, వాయిస్ ద్వారా గానీ ఓటును వినియోగించుకోవచ్చును. తప్పనిసరి పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలను నిర్వహిస్తారు.

2019లో చివరిగా ఎస్‌ఎంసీ ఎన్నికలు...

జిల్లాలో 2019 డిసెంబర్‌లో చివరి సారిగా ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. రెండేళ్ల కాల పరిమితితో ఎన్నికలు నిర్వ హించారు. వీటి గడువు 2021 డిసెంబర్‌తో ముగిసింది. అయితే కొవిడ్ ప్రభావం వల్ల ఎన్నికల నిర్వహణలో జాప్యం ఏర్పడింది. దీంతో పాత కమిటీల కాల పరిమితిని పలు సార్లు పొడిగిస్తూ వచ్చారు. గత నాలుగేళ్లుగా పాత కమిటీలు కొనసాగాయి.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తాం

జగన్ మోహన్ రెడ్డి, జిల్లా విద్యాధికారి



జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాము. ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎంసీల గడువు ముగియడంతో నూతన కమిటీలను ఎన్నుకోవ డానికి ప్రభుత్వం తాజాగా ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియ ఈ నెల 20న ప్రారంభిస్తాం. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ ప్రక్రియ అమలు చేస్తారు.

ప్రత్యేక సమావేశాల్లో...

కమిటీల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. విధివిధానాలు వివరించి తొలుత ప్రతితరగతి నుంచి ముగ్గురు ప్రతినిధులను, ఆ తదుపరి మళ్లీ ప్రత్యేకంగా సమావేశమై ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఎన్నుకుంటారు. ఎక్కువ మంది పోటీ ఉంటే ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుంటారు. ఈ కమిటీల్లో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, అంగన్‌వాడీ టీచర్, ఆరోగ్య కార్యకర్త, మహిళా సమాఖ్య సభ్యురాలికి ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎంపికయ్యే తల్లిదండ్రుల్లో కేటగిరీల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తారు.

విధులు, బాధ్యతలు ఇవీ...

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజ రు, యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర వ్యవహారాలను ఎస్‌ఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు పర్యవేక్షిస్తారు. మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులను పరిశీ లిస్తారు. మూత్రశాలలు, తాగునీరు, మైదానాలు, క్రీడా సామగ్రి తదితర సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేయాల్సి ఉంటుంది. పాఠశాలల అభివృద్ధికి, లక్ష్యం మేరకు ఫలితాలు సాధించడానికి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. నిర్వహణ నిధులు ప్రధానోపాధ్యాయులు, కమిటీ ఛైర్మన్ జాయింట్ ఖాతాల్లో జమ అవుతాయి. వీటిని సక్రమంగా వినియోగించాలి.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల పరిస్థితి ఇలా..

జిల్లా వ్యాప్తంగా వివిధ 838 ప్రభుత్వ, కేజీబీవీ, జడ్పీ, మినీ గురుకు లాలు, టీఎస్ మోడల్ స్కూల్స్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర పాఠశాలలు న్నాయి. ఇంద ులో 514 ప్రాథమిక పాఠశాలలు, 91 ప్రాథమికోన్నత పాఠశా లలు, 233 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 3,568 ఉపా ధ్యాయులు పని చేస్తున్నారు. 1,173 మంది ప్రాథమిక పాఠశా ల ఉపాధ్యాయులు, 454 మంది ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, 1,706 మంది ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు, 285 కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 57,771 మంది విద్యార్థులు ప్రవేశాలు పొంది ఉన్నారు. ఇందులో 25,604 మంది ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, 6,438 మంది ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, 25,729 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులున్నారు.

పొలాస వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

జగిత్యాలరూరల్, జనవరి 19 : జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులో గల పెట్రోల్‌బంక్ సమీపంలోని ధర్మపురి ప్రధాన రహదారిపైన రాత్రి 9 గంటల ప్రాంతంలో ఓ గుర్తుతెలియని వాహనం వరుసగా మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. జగిత్యాల ప ట్టణంలోని విజయపురికాలనీకి చెందిన దయ్యాల రమేష్, జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన గణేష్, కల్లెడ గ్రామం నుంచి జగిత్యాల వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా పొలాస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దయాల రమేష్(33) అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ప్రమాదంలో ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన పాత్రికేయుడు అక్కినపెల్లి బాబుకుమార్ కాలు పూర్తిగా తెగిపోయి తీవ్రరక్తస్రావమైంది. తీవ్రంగా గాయపడినవారిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ బీఎస్ లత



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో గణతంత్ర వేడుకల్లో గ్రామాలకు సంబంధించిన కార్యక్రమాలను, ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించిన శకటాలను, స్టాల్స్‌ను ఏర్పాటు చేసే విధంగా చూడాలని సూచించారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు అయిన తదుపరి మొదటిసారిగా గణతంత్ర వేడుకలను నిర్వహించుకుంటున్నామని, ఖచ్చితంగా ఇంతకు ముందులా కాకుండా మార్పులు చేర్పులు ఉంటాయన్నారు. పలువురు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జిల్లా ఉపాధికల్పనా అధికారి సత్తెమ్మ



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

జగిత్యాల అర్బన్, జనవరి 19: ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు దక్కని నిరుద్యోగ యువతీ, యువకులు ప్రైవేట్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా ఉపాధికల్పనా అధికారి సత్తెమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సముదాయ భవనంలో గల జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శ్రీరామ్ చిట్స్, వరుణ్ మోటార్స్ సంస్థలకు చెందిన ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు శుక్రవారం ఆయా సంస్థల ప్రతినిధులు నిర్వహించగా, ఈ ఇంటర్వ్యూలకు సుమారు 100మంది యువతీ, యువకులు హాజరయ్యారు. అనంతరం సత్తెమ్మ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్ వృద్ధికి బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ లింగమూర్తితో పాటు ఆయా కంపెనీ ప్రతినిధులు, నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు.

భూముల వివరాల గల్లంతుపై యజమానుల ఆందోళన

మల్యాల, జనవరి 19: జాతీయ రహదారి కోసం భూములు కోల్పోతున్న రైతులకు అందజేసే నష్టపరిహారం కోసం ప్రకటిస్తున్న జాబితాల్లో తమ భూముల వివరాలు కొంత మేర గల్లంతు అయ్యాయని యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి -563 నాలుగు లైన్ల కోసం భూసేకరణపై స్థలాలు కోల్పోతున్న భూమి యజమా నుల నుంచి జగిత్యాల ఆర్డీవో నరసింహమూర్తి శుక్రవారం అభ్యంతరాలను స్వీకరించారు. మండలంలోని రాజారం, పోతారం, నూకపల్లి, ముత్యంపేట గ్రామాల పరిధిలో గల భూ యజమానులతో సమావేశం నిర్వహించగా భూయజమానులు తమ అభ్యంతరాలను తెలిపారు. ఈ సందర్భంగా తమ భూములు పూర్తి స్థాయిలో ప్రకటించడం లేదని దీంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు జాబి తాలు ప్రకటించిన అధికారులు భూముల వివరాలు స్పష్టంగా పేర్కొవాలని అన్నారు. మార్కెట్ ధరలు తమకు నష్టపరిహారంగా చెల్లించాలని కోరారు. ప్లాట్ల భూములకు సంబంధించి అనేక మంది యజమానుల వివరాలు రాలేదని పేర్కొనగా వివరాలు తమకు అందజేస్తే ఎంజాయిమెంట్ సర్వే చేస్తామని తెలిపారు. తమ అభిప్రాయాలను పూర్తిగా స్వీకరించ లేదని పలువురు భూయజమానులు ఆరోపించారు. తహసీల్దార్ మునీంధర్, ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

ఎండపల్లి, జనవరి19; కొండాపూర్ గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, కొండాపూర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ కంచుకోట అని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవన్‌రెడ్డి, వివేక్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వీరికి ఘన స్వాగతం పలికారు. 2017లో ఈజీఎస్ ద్వారా మంజూరైన 16 లక్షలు, ఎమ్మెల్సీ కోటా నుంచి జీవన్‌రెడ్డి 5 లక్షలు ఇవ్వడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ..తమకు కొండాపూర్ గ్రామంతో చిన్నప్పటి నుంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ రోజు తాను ఎమ్మెల్సీగా ఉన్నానని కాని గ్రామస్థులు తనను పదవి చూసి మర్యాద ఇవ్వలేదని తనపై గౌరవంతో ఇంత మర్యాద చేసినందుకు వారికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఎమ్మెల్యే అడ్లూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి కొండాపూర్ కంచుకోట అని తనకు గ్రామం నుంచి ప్రతి ఎన్నికలలో అత్యధిక మెజారిటీ ఇస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. పదేళ్ల తర్వాత ప్రభుత్వం అధికారంలోకి రావడం వలన మంచి రోజులు వచ్చాయన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి 5 లక్షలు గ్రామ పంచాయతీకి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సాగు నీటికి జీవన్‌రెడ్డి సహకారంతో శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేసుకుందామని అన్నారు. కొండాపూర్, జగదేవ్‌పేట రహదారి గుంతలు పడడంతో వాటి మరమ్మతు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శైలెందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రాజవ్వ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల భాగస్వామ్యం కీలకం

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న ఉద్యోగులు

జగిత్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల భాగస్వామ్యం కీలకంగా ఉంటుందని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను పలువురు సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యులమవుదామని సూచించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షాహిద్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు త్వరలోనే రెండు డీఏలు ప్రకటిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్తర్, సలీమ్, షహీద్ బాబా, జమీల్, తమీం, జుబైర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదు కార్యక్రమం, ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపుల ఏర్పాటు, పెండింగ్ ఫారంల పరిష్కారం, పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్య క్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, ఆర్డీవోలు నర్సింహమూర్తి, మధు, ఎన్నికల విభాగం తహసీల్దార్ హకీమ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ బాలికల దినోత్సవాన్ని ప్రారంభించిన కలెక్టర్

పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను శుక్రవారం కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా ప్రారంభించారు. ముందుగా బేటి బచావో బేటి పడావో ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమే మాట్లాడారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బేటి బచావో బేటి పడావో ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందన్నారు. ఈనెల 19వ తేది నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి బీజేపీ పెద్దపీట

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి

రాయికల్, జనవరి 19: కుల సంఘాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ బోగ శ్రావణి అన్నారు. రాయికల్ మండలంలోని మై తాపూర్ గ్రామంలో ఎస్సీ (మాల) కుల సంఘ భవనానికి, రాయికల్ ప ట్టణంలోని మండల స్థాయి స్వర్ణకార సంఘ భవనానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ నిధుల నుంచి మంజూరైన ప్రొసీడింగ్‌లను ఆ యా కుల సంఘాల పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మైతా పూర్ ఎంపీటీసీ రాజనాల మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు తొగిటి లక్ష్మీ నారాయణ, మండల ఐటీ సెల్ కన్వీనర్ మోత్కూరి శ్రీనివాస్ గౌడ్, మా జీ సర్పంచ్ రమ్య, దుంపల లలిత, దొంగ లింగారెడ్డి, కొల్ల రవి, మచ్చ నారాయణ, కుర్మ మల్లారెడ్డి, శ్రీకాంత్, ఆశన్న, స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారా యణ, సంఘ అధ్యక్షుడు మూగల సంజీవ చారి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ

జగిత్యాల అర్బన్, జనవరి 19: భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా మైడిపెల్లి సత్యనారాయణరావు రెండవసారి నియమితులైన సందర్భంగా బీజేపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ సైతం శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రావు మాట్లాడుతూ సమిష్టి కృషితో ఎంపీ ఎన్నికల్లో మ రోసారి విజయం సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్



కట్లకుంట గ్రామంలో వికలాంగుడితో విప్ ఆది కరచాలనం

మేడిపల్లి, జనవరి 18: పేద ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామంలో కృతజ్ఞతా ర్యాలీలో ఆది పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఆదిని ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన విజయానికి ఆహర్నిశలు కృషి చేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఓటు వేసి తనను ఆశీర్వదించి గెలిపిస్తే, పెద్దలు తనకు ప్రభుత్వ విప్‌గా మరో మెట్టు ఎక్కించారని అన్నారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలు తప్పక నేరవేరుస్తానని గుర్తు చేసుకున్నారు. కట్లకుంట గ్రామంలో లింకురోడ్లు పూర్తి చేస్తానని అన్నారు, మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నరేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, భూమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేంధర్‌రెడ్డి, జజలందర్‌రెడ్డి, దామెదర్, దశరథరెడ్డి పాల్గొన్నారు.

ఈ నెల 22న సెలవు ప్రకటించాలి

జగిత్యాల అర్బన్, జనవరి 19: ఈ నెల 22 సోమవారం అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రతిష్టాపనోత్సవం సందర్భంగా సెలవు ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ పక్షాన అదనపు కలెక్టర్ బీఎస్‌లతను కలిసి విజ్ఞప్తి చేశారు. వారు మాట్లాడుతూ దేశమంతా పండగ వాతావరణం నెలకొనే రోజు కనుక సెలవు ప్రకటించేలా చూడాలని కోరారు. తపస్ బాధ్యులు దేవయ్య, ప్రసాద్‌రావు, నరేంధర్ రావు, మైపాల్‌రెడ్డి, రఘునందన్, రజినీకాంత్, శ్రీనివాసరావు తదితరులున్నారు.

కాలువ శుభ్రం చేయాలి

బీర్‌పూర్, జనవరి 19: చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందే విదంగా కాలువ శుభ్రం చేయాలని ఎమ్మెల్సీ టీ. జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి మీదుగా కొల్వాయికి వెల్లే 2ఎల్ కెనాల్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలువలో ఎక్కడ కూడా చెత్త ఉండకుండా చూసి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంటా ఎస్సారెస్పీ డీఈ చెక్రు నాయక్, ఎంపీపీ మసర్తి రమేష్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, కొల్వాయి సింగిలివిండో చైర్మన్ నవీన్ రావ్, కాంగ్రెస్ పార్టీ మడల అధ్యక్షులు చెరుపూరి సుభాష్, ఉపాధ్యక్షులు జోగి రెడ్డి, నాయకులు మల్లా రెడ్డి, శేఖర్, శంకర్, రమేష్ ఉన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, జనవరి, 19 : గ్రామాల్లోని డ్రైనేజి, సీసీ రోడ్లు, మంచి నీటి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఉదయం కాలనీలో ఎంపీపీ మారు సాయిరెడ్డితో కలిసి వీధులలో తిరుగుతూ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ శివారులోని పెద్దచెరువు తూమ్ చెత్తతో నిండి పోవడంతో పంట పొలాలకు నీరు అందడం లేదని రైతులు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ డీఈకు ఫోన్ చేసి తూమ్‌లో నిలిచన చెత్తను తొలగించి సాగు నీరు సరఫరా చేయాలని, పెండింగ్‌లో ఉన్న తూమ్ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలోని కరెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని, ఇండ్లపైన ఉన్న విద్యుత్ వైర్లతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలుపగా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. గ్రామంలోని మురికి కాలువలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామనానరు. యన వెంట నాయకులు ఎంపీడీవో భీమేష్‌రెడ్డి, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఎంపీవో తిరుపతిరావు, కార్యదర్శి అశోక్‌గౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు గుర్తుంచుకునేలా పనులు చేయాలి

ప్రజలు గుర్తుంచుకునేలా పనులు చేయాలని అధికారులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. శుక్రవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజక వర్గంలోని మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు సంబంధించిన ప్రజాప్రతిని ధులు వారి గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పర్యటించిన సమయంలో ప్రధానంగా విద్యుత్ సమస్యలు ఎక్కువగా తన దృష్టికి వస్తున్నాయన్నారు. దీనికి కారణం కింది స్థాయి అధికారుల పనితీరు బాగలేక పోవడంతోనేనన్నారు. పనితీరు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, మల్లాపూర్ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ డీఈ తిరుపతిరావు, ఏడీ మనోహర్, అంజన్‌ప్రసాద్, ఎంపీడీవో భీమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వెల్లుల్లలోని సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఎంపీపీ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సైదాపూర్, జనవరి 19: సైదాపూర్ మండల వ్యాప్తంగా ఎరువుల దుకాణాలను విస్తృ తంగా తనిఖీ చేస్తున్నట్లు వ్యవసా యాధికారి వైదేహి తలిపారు. శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంతో పాటు పెర్కపల్లి, ఆకునూర్, ఎల్లంపల్లి గ్రామాలలో వ్యవసాయాధికారి వైదే హి ఎరువుల దుకాణాలు తనిఖీ చేయడంతో పాటు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతీ రోజు కొన్ని షాపులను ఎంచుకొని వాటిలో రికార్డులను పరిశీలస్తున్నామన్నారు. డీలర్లు ఎపోస్ మిషన్‌కు స్టాక్ రిజిష్టర్ గ్రౌండ్ బ్యాలన్స్ తో సరి పోతుందా లేదా అనిపరిశీలిస్తున్నామని చెప్పారు. ఎరువుల విక్రయాలు తప్పని సరిగా ఎపోస్ మిషన్ ద్వారానే చేయాలనిన్నారు. ఈ యాసంగి సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా స్టాక్ ఎప్పిటికప్పుడు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తనిఖీలలో రికార్డుల సక్రమంగా లేనట్లు తేలితే షాపుల లైసన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. షాపుల పరిశీలనతో పాటు ప్రతీ రోజు పంటలను పరిశీలస్తున్నామని వివరించారు. చీడ పీడల నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు.

పాముకాటుతో బాలుడి మృతి

మానకొండూర్, జనవరి 19: మానకొండూర్ గ్రామానికి చెందిన సుహన్ అనే బాలుడు శుక్రవారం పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అనూష నవీన్ దంపతుల కుమారుడు సుహాన్(3) ఏళ్ల బాలుడు శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటుండగా పాము కాటు వేసింది.. బాలుడు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమంచి బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



సుహాన్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సైదాపూర్, జనవరి 19: సైదాపూర్ మండల కేంద్రంలో జీపు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్కేపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్, రజినీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు సైదాపూర్ పాత బస్టాండ్ మీదుగా దుద్దెనపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన జీపు ఆ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. కింద పడిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళా గురుకులంలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్

జగిత్యాలరూరల్, జనవవరి 19: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులో గల సాంఘిక సంక్షేమ శాఖ మహిళా గురుకుల కళాశాలలో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 20న మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించనునన్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ గోలి శ్రీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 టీఎస్ ఎంసెట్ (బైపీసీ)లో అర్హత సాధించినవారు అర్హులని ఆసక్తికలవారు అన్ని ధ్రువపత్రాలు ఒరిజనల్ జిరాక్స్ ప్రతులతో హైదరాబాద్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల ప్రధాన కార్యాలయంలో హాజరుకావాలన్నారు. వివరాలకు కళాశాలలో 8142747880లో సంప్రదించాలని కోరారు

రాజన్న క్షేత్రంలో భక్తుల సందడి

- అనుబంధ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు

వేములవాడ, జనవరి 19: వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురా సుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ, కళాభవన్లో శ్రీస్వామివారి నిత్యకళ్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో లఘు దర్శనం అమలు చేశారు. దీంతో భక్తులు నందీశ్వరుడి విగ్రహం వద్ద నుండి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

ధర్మపురిలో రెండో రోజు
వేద పారాయణం

ధర్మపురి, జనవరి 19: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు రెండవ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెండో రోజూ 21 మంది వేదపండితులు రుగ్వేద హవనం, సామవేద పారాయణం, శ్రీ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనల మేరకు ఆలయ వేదపండితులు, అర్చకులు, రినోవేషన్ కమిటీ సభ్యులు, స్థానిక వేదబ్రాహ్మణులు ఈ కార్యక్రమానికి సహకారం అందించారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మండపంలో కూడ వేదపండితులు పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


వేదపారాయణం నిర్వహిస్తున్న వేదపండితులు

పాస్‌పోర్ట్ ఏజెంట్ల ఇళ్లలో సీబీఐ సోదాలు

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు


పాస్ పోర్ట్ ఏజెంట్ ఇంటి వద్ద సీబీఐ అధికారులు

కోరుట్ల, జనవరి 19: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ పాస్‌పోర్టు ఏజెంట్ల ఇళ్లపై సీబీఐ అధికారులు శుక్రవారం సోదాలు చేశారు. కోరుట్ల పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆశోక్, ఐబీ రోడ్డులో నివాసం ఉంటున్న చాంద్ పాషా (ప్రభుత్వ ఉపాధ్యాయుడు), రతాల పంపు ప్రాంతంలో ఉంటున్న కమర్ పాస్‌పోర్టు ఏజెంట్ల ఇళ్లలో అధికారులు సోదాలు జరిపారు. నాలుగు బృందాలుగా విడిపోయిన సీబీఐ అధికారులు ఏకకాలంలో వారి వారి ఇళ్లలో సోదా చేసి ఇంట్లో ఉన్న నకిలీ నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, వివిధ అధికారుల హోదాతో ఉన్న స్టాంప్‌లతో పాటు ల్యాప్‌టాపులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిసింది. అశోక్ రావు, కమర్‌ను అదుపులోకి తీసుకోగా చాంద్ పాషా పరారైనట్లు తెలుస్తోంది. ఆశోక్ రావుతో పాటు కమర్‌ను విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా చాంద్ పాషా పరారీలో ఉన్నడని ప్రచారంతో పాటు హైదరాబాదులో వారి బంధువుల శుభకార్యానికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. కొందరు గల్ఫ్ ఎజెంట్లు, ట్రావెల్స్ యజమానుల గుండెలలో రైలు పరుగులు తీయడంతో పాటు వారి కార్యాలయాలను మూసివేసుకున్నారు. సీబీఐ అధికారులు కోరుట్ల నుంచి వెళ్లిపోయ్యారన్న సమాచారంతో వారు ఉపిరి పీల్చుకున్నారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మెట్‌పల్లి, జనవరి, 19: ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌ల్లో విలేకరుల సమావేశంలో ఆయన ఎస్సై చిరంజీవితో కలిసి మాట్లాడారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన షేక్ హైదర్, నిజామాబాద్ జిల్లా మోర్తడ్‌కు చెందిన ఎర్ర వెంకటి, కొర్వ సంతోష్‌కు ఆరు నెలల క్రితం జైల్లో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలైన తరువాత సులభంగా డబ్బులు సంపాదించాలని ఆలోచనతో ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. రెండు నెలల క్రితం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని సాయిబాబ ఆలయంలోని హుండీ, 15 రోజుల క్రితం కోరుట్ల పట్టణంలోని ఎల్లమ్మ గుడిలోని హుండీ, ఇబ్రహీంపట్నంలోని గోదురులోని పోచమ్మ, హనుమాన్ ఆలయాల్లోని హుండీ పగలగొట్టి బంగారం, వెండి అభరణాలు చోరీ చేశారు. కోరుట్ల మండలంలోని ధర్మారంలోని రామాలయంలోని హుండీ పగలగొట్టి నగదు దోచుకున్నారు. మూడు రోజుల క్రితం మండలంలోని జగ్గసాగర్, రామలచ్చక్క, ఆత్మనగర్ గ్రామాల్లోని ఆలయాల్లోని బంగారం, వెండి, హుండీలను ఎత్తుకెళ్లారు. వారిని మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో వారిని పట్టుకొని ద్విచక్ర వాహనం, 14 తులాల వెండి, రూ. 9 వేలు, తాళాలు పగల గొట్టే కొంకిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్‌తో పాటు కానిస్టేబుల్ కిరణ్, సంతోష్‌ను డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించి రివార్డులను అందజేశారు.

ఆలయాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని ఆందోళన

- అధికారుల చర్చలతో సద్దుమణిగిన గొడవ


ఆందోళన చేస్తున్న తిమ్మాపూర్ గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, జనవరి 19: ఆలయాలకు రహదారితో పాటు ఆలయానికి సంబంధించిన భూమిని వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తు శుక్రవారం తిమ్మాపూర్ గ్రామస్థులు పెద్దమ్మ ఆలయం వద్ద రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ శివారులోని గ్రామ దేవతలైన పోచమ్మతో పాటు వివిధ ఆలయాలకు వెళ్లేందుకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని అక్కడకు వెళ్లేందుకు రహదారి ఇస్తానని చెప్పి ఇప్పుడు ఇవ్వకుండా వీడీసీ సభ్యులపైన పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ దాదాపుగా మూడు గంటల పాటు మహిళలు, గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. ఎస్ఐ ఉమాసాగర్ అక్కడకు చేరుకుని వారిని శాంతింపజేసే ప్రయత్నం చేసినా వినలేదు. దీంతో సంఘ బహిష్కరణకు గురైన బాధిత కుటుంబ సభ్యులను పిలిపించారు. అక్కడకు చేరుకుని ఇరువురు చర్చలు జరిపారు. ఆనంతరం ఇరువురు శాంతించి ఆలయాలకు వెళ్లేందుకు నాలుగు ఫీట్ల రోడ్డును ఇవ్వడంతో పాటు వీడీసీ సభ్యులపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకుంటున్నట్లు తెలపడంతో గ్రామస్థులు శాంతించారు.

కరీంనగర్ కార్పొరేటర్ కుల ధ్రువీకరణ పత్రం రద్దు

కరీంనగర్ టౌన్, జనవరి 19: నగరపాలక సంస్థ 6వ డివిజన్ కార్పొరేటర్ కోల మాలతి సంపత్‌రెడ్డి బీసీ-డి (మున్నూరు కాపు) కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు జారీ చేశారు. 6వ డివిజన్ బీసీలకు కేటాయించగా కోల మాలతి సంపత్‌రెడ్డి బీసీ-డి మున్నూరు కాపు కులధ్రువీకరణ పత్రంతో 2020లో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. అయితే ఆమె రెడ్డి ఓసీ వర్గానికి చెందినవారని, ఆమె సమర్పించిన బీసీ కులధ్రువీకరణపై విచారణ జరిపి రద్దు చేయాలని కోరుతూ సాధవేని వినయ్‌కుమార్ అనే న్యాయవాది 2020లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్ డిస్ట్రిక్ట్ లెవల్ స్ర్క్యూటినీ కమిటీకి మాలతి సంపత్‌రెడ్డి కులధ్రువీకరణ పత్రాన్ని పంపించి విచారణకు ఆదేశించారు. దీనిపై విచారించిన డిఎల్ఎస్‌సి మాలతి సమర్పించిన బీసీ డీ కులధ్రువీకరణ రద్దు చేసింది. దీనితో మాలతిసంపత్ కోర్టును ఆశ్రయించడంతో పాటు ప్రభుత్వానికి కూడా అప్పీలు చేసుకోవడంతో తిరిగి విచారణ జరిపారు. డిఎల్ఎస్‌సి ఇచ్చిన నివేదిక మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ 30రోజుల్లో అప్పీలు చేసుకోవాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చదరంగ పోటీలు ప్రారంభం

- 11 రాష్ట్రాల నుంచి 300 మంది క్రీడాకారులు రాక
- 100 మంది అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులు హాజరు


చెస్ ఆడుతున్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19: అఖిలభారత ఫిడె రేటింగ్ అండర్-1,600 చదరంగ పోటీలు జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వనాథ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ తొలిఎత్తువేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధస్సును పెంపొందించే క్రీడా చదరంగం అని అన్నారు. చిన్నారులు చదరంగా క్రీడను నేర్చుకోవడంతో వారికి జ్ఞాపక శక్తి పెరిగే అవకాశం ఉందన్నారు. తద్వారా విద్యార్థులు చదువులో రాణిస్తారని, మంచి క్రమశిక్షణ అవడుతుందన్నారు. కరీంనగర్‌లో మొట్టమొదటిసారిగా అండర్-1,600 ఫిడె చదరంగ పోటీలను కరీంనగర్ వైశ్యభవన్ వేదికగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. అంతర్జాతీయ క్రీడాకారుడు విశ్వనాథ్ అకాడమీ కోచ్ అంతగిరి విశ్వనాథ్ మాట్లాడుతూ కరీంనగర్‌తోపాటు తెలంగాణ రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రొత్సహించే ఉద్దేశ్యంతో జాతీయ, అంతర్జాతీయ చదరంగ క్రీడాపోటీలను ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారుల అభివృద్ధే లక్ష్యంగా భవిష్యత్‌లో మరిన్ని పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో దేశంలోని 11 రాష్ట్రాలనుంచి 300 మంది చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో 100 మంది అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులు ఉన్నారని వివరించారు. మొదటిరోజు నిర్వహించిన 3 రౌండ్ల పోటీల్లో కన్నం విశ్వనాథ్, అరగొండ మోహన్, సి పవన్, బి మహేందర్, గౌరిచందర్ ముందంజలో ఉన్నారని, పోటీల ఆర్బిటర్ సంజయ్ తెలిపారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్, అకాడమి కోచ్ కొప్పర్తి శివయ్య, కె జగన్ తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ

భూములు తీసుకుంటే ఆత్మహత్యే శరణ్యం

- బైపాస్ రహదారి భూ సర్వేను అడ్డుకున్న రైతులు
- సర్వే నిలిపివేసి వెనుదిరిగిన అధికారులు

మెట్‌పల్లి రూరల్, జనవరి 19: వ్యవసాయం చేసుకుంటూ ఉన్న భూములను తీసుకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులో ఆందోళనకు దిగారు. శుక్రవారం గ్రామ శివారులో అధికారులు సర్వే చేస్తుండగా విషయం తెలుసుకున్న వెల్లుల్ల, బండలింగాపూర్, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు సంఘటన స్థలానికి వచ్చి బైపాస్ రహదారి భూ సర్వేను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి ఆర్డీవో మధు, తహసీల్దార్ శేఖర్ సంఘటన స్థలానికి వచ్చారు. భూములను నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తాము విలువైన భూములను ఇవ్వమని గతంలోనే చెప్పామని రైతులు పేర్కొన్నారు. రహదారి కోసం భూములు తీసుకుంటే ఉన్న జీవనోపాధి కోల్పోయి పని లేక ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప వేరే దారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు భూ పరిధిని బట్టి నష్టపరిహారం నిర్ణయిస్తారని, భూ సర్వే చేయనివ్వాలని ఆర్డీవో కోరినా రైతులు వినకుండా సర్వేను అడ్డుకున్నారు. దీంతో చేసేది లేక అధికారులు సర్వేను నిలిపి వెనుదిరిగారు.


మెడిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మధు

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 7,105 మంది విద్యార్థులు

చొప్పదండి జనవరి 19: జాతీయ స్థాయిలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే జవహర్ నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 11-30 గంటల నుంచి 1-30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, 7,105 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకరావాలని, అరగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

● 4 బ్లాకులలో..

నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏడు జిల్లాల పరిధిలోని 14 బ్లాకులలో 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలు, జగిత్యాలలో 11, సిరిసిల్లలో 5, పెద్దపల్లిలో 5, జయశంకర్ భూపాలపల్లి పరిధిలోని మహాదేవ్‌పూర్‌లో, సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్‌లో, హనుమకొండ పరిధిలోని ముల్కనూరులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే 9490395216, 9966759402, 988 5101327 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

'ఖని'లో సైబర్ నేరస్థుల పంజా

- ఆధార్ అనుసంధానం పేరిట బ్యాంకు ఖాతాలు ఖాళీ
- ఖాతాదారులకు సంబంధం లేకుండా బయట రాష్ట్రాల్లో డబ్బులు విత్‌డ్రా
- గోదావరిఖని వన్‌టౌన్‌లోనే 43కేసులు

కోల్‌సిటీ, జనవరి 19: గోదావరిఖనిలో సైబర్ నేరస్థులు పంజా విసురుతున్నారు. ఆధార్ అనుసంధానం పేరిట బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఖాతాదారులకు సంబంధం లేకుండానే, వారు ఎలాంటి ఫోన్ వాడకుండానే, లింకులు ఓపెన్ చేయకుండానే రోజుకు రూ.10వేల చొప్పున బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము ఖాళీ అవుతుంది. బయటి రాష్ట్రాల్లో ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్) ద్వారా బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు వేసి డబ్బులు విత్‌డ్రా చేసుకున్నట్టు మెసేజ్‌లు వస్తున్నాయి. బ్యాంకుల్లోకి వెళితే పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ కేంద్రంగా మినీ ఏటీఎంలలో డబ్బులు డ్రా అయినట్టు గుర్తించారు. బాధితులు అలర్ట్ అయ్యేలోగానే వారి ఖాతాల నుంచి మళ్లింపబడిన సొమ్మును సైబర్ నేరస్థులు డ్రా చేసుకుంటున్నారు. గోదావరిఖని పట్టణంలోనే రెండు నెలల వ్యవధిలో వందల సంఖ్యలో ఈ విధంగా అకౌంట్లను కొల్లగొడుతున్నారు. బాధితులు అలర్ట్ అయి సైబర్ పోర్టల్‌లో 1930 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేసి అకౌంట్లను ఫ్రీజ్ చేస్తున్నారు. ఇలా ఫ్రీజ్ అయినవే 43నమోదు అయ్యాయి. ఇక సొమ్ములు పోగొట్టుకున్నవి వందల సంఖ్యలో ఉంటున్నాయి.

● రంగంలోకి సైబర్ క్రైమ్

గోదావరిఖని పట్టణంలోనే ఈ తరహా నేరాలు జరుగుతుండడంతో రామగుండం కమిషనరేట్ సైబర్ క్రైమ్ అప్రమత్తమయ్యింది. దీనికి సంబంధించి విచారణ ప్రారంభించింది. గోదావరిఖనిలో ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్) సిస్టంతో డబ్బులు పోగొట్టుకున్న బాధితులంతా పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల సందర్భంగా బయోమెట్రిక్ వేలిముద్రలు వేసిన వారే ఉన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల సందర్భంగా కొనుగోలు, అమ్మకాలు చేసిన వారు, సాక్షులుగా ఉన్న వారు బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు వేశారు. వీరి డాటా హ్యాక్ కావడం కానీ, చోరీ జరగడం కానీ అయి ఉంటుందని భావిస్తున్నారు. ఈ దిశగా విచారణ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మాత్రం తమ సైబర్ సెక్యూరిటీ సిస్టం పటిష్ఠమైందని, చోరీచేసే అవకాశాలు లేవంటూ పేర్కొంటున్నారు. దీంతో హైదరాబాద్‌లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సంప్రదించే పనిలో ఉన్నారు.



గ్రూప్స్ శిక్షణ దరఖాస్తులకు నేడు తుది గడువు

గణేశ్‌నగర్, జనవరి 19: కరీంనగర్ బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణనిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ bcstudycircle.cgg.gov.in లో ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్లో శిక్షణ కోసం డిగ్రీ అర్హత కలిగిన కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగయువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబవార్షిక ఆదాయం ఐదు లక్షల రూపాయలకు మించరాదన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, లేటెస్ట్ కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఆధార్ కార్డ్, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 0878-228686లో, బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనము కరీంనగర్ కార్యాలయ సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు

ధర్మపురి, జనవరి 19: ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల విజయ్, ప్రదీప్‌కుమార్, సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్య సూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అపమృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గండ దీపంలో నూనె పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో కూడా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

మతిస్థిమితం కోల్పోయి మహిళ ఆత్మహత్య

ముస్తాబాద్, జనవరి 19: మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో మతిస్థిమితం కోల్పోయి ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తెర్లుమద్దికి చెందిన తోవెటి లక్ష్మి(55) మతి స్థిమితం కోల్పోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి కుమారుడు కార్తీక్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊపిరి ఆడక వ్యవసాయ కూలీ మృతి

వీణవంక, జనవరి 19: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన డుకిరె రాజు (32) అనే వ్యవసాయ కూలీ ప్రమాదవశాత్తు బురదలో పడి ఊపిరి ఆడక శుక్రవారం మృతి చెందాడు. పోలీస్‌లు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమ్మత్‌నగర్‌కు చెందిన రాజు ఉదయం వరి నారు మోసేందుకు కూలీ పనికి వెళ్లాడు. నారు నెత్తిన పెట్టుకొని నడుస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. బురదలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి వంశీకృష్ణ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పెద్దపల్లిటౌన్, జనవరి 19: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డులో నిర్వహిస్తున్న వ్యభిచారం గృహంపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. పట్టణానికి చెందిన ఓ మహిళ చీకురాయి రోడ్డులో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని వ్యభిచార స్థావరం నిర్వహిస్తుందన్న పక్కా సమాచారంతో దాడి చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు మహిళలను సఖి కేంద్రానికి తరలించినట్లు, స్థావరం నిర్వహిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 19: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,700 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 61మంది రైతులు 538క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,700, కనిష్ఠ ధర 5,800 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 1,080క్వింటాళ్ల పత్తిని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసింది.

జిల్లా క్రికెటర్లు భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలి

- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19: జిల్లాలో క్రికెట్‌లో రాణించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని, భవిష్యత్‌లో జిల్లాకు చెందిన క్రికెటర్లు రంజీ, భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఆకాంక్షించారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానంలో జరుగుతున్న యూనిటీ కప్ 2024, క్రికెట్ లీగ్ పోటీలు శుక్రవారం నాటికి క్వార్టర్స్ ఫైనల్ దశకు చేరుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం స్టేడియంలో జరిగిన మొదటి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని హెచ్‌సీఏ, బీసీసీఐలను కోరనున్నట్లు తెలిపారు. క్రికెట్‌లో ఉన్న ఆసక్తిని బట్టి జిల్లాలో క్రికెట్ అకాడమీలను నెలకొల్పడానికి హెచ్‌సీఏ ముందుకు రావాలని సూచించారు. ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించిన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రికెటర్లను వెలుగులోకి తీసుకొస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షులు యాదగిరి మాట్లాడుతూ మ్యాచ్‌లు అత్యంత హోరాహోరీగా జరుగుతున్నాయని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్టుకు భారీ ప్రైజ్‌మనీని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి పుల్లమల్ల ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి సిలివేరి మహేందర్, క్రికెట్ కోచ్ కన్నన్, నిర్వాహకులు సురేష్, మహర్షి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్యాం ప్రసాద్

వెల్గటూర్, జనవరి 19: ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోటిలింగాలలో న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం కావలిస్తే లీగల్ కౌన్సిల్ ద్వారా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ రెడ్డి, న్యాయవాదులు గడ్డం లింగారెడ్డి, రౌతు రాజేష్, బందెల రమేష్, రామడుగు రాజేష్, గూడ జితేందర్ రెడ్డి, అలుక వినోద్ కుమార్, కస్తూరి శరత్ కుమార్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఆదాయపు పన్ను మినహాయించాలి

కోరుట్ల, జనవరి 19 : ప్రభుత్వం ఉద్యోగాలు చేసి రిటైర్డ్ అయిన పెన్షన్ దారులకు ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ పెన్షనర్ల రాష్ట్ర కార్యాదర్శి హరి ఆశోక్ కుమార్ ఆద్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు పోస్టు కార్డు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడారు. 2024-25 కేంద్రా బడ్జెట్‌లో పెన్షనర్లకు ఆదాయపు పన్నును మినహాయింపు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం దృషి సారించాలన్నారు. పెన్షనర్ల సమస్యను కేంద్ర ప్రభుత్వం పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పోస్టు కార్డును పోస్టాఫీస్‌లో పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ దారుల సంఘ సభ్యులు శివానందం, గౌరి శెట్టి విశ్వనాథం, హన్మంత్ రెడ్డి, ఎండి యాకూడ్, గంటేడి రాజు మోహన్, నల్లాల లక్ష్మీనారాయణ, సైపోద్దీన్, చిలుక గంగారాం పాల్గొన్నారు.

రాములోరి అక్షింతలకు ఘన స్వాగతం



అంక్షలను పంపిణీ చేస్తున్న బీజేపీ, హిందు దార్మిక సంస్థ నేతలు

కోరుట్ల, జనవరి 19 : అయోధ్య పట్టణంలో ప్రత్యేకంగా పూజించిన అక్షింతలు కోరుట్ల పట్టణానికి చేరుకోగా పలు వార్డులోని కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం పట్టణంలోని లక్ష్మీ అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకున్న అంక్షతలకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సం దర్భంగా అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వారికి బీజేపీ, హిందు దార్మిక సంఘ నేతలు అక్షంతను పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో రాముని ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఇంటింటికీ నిర్వహించి వేడుకలను నిర్వహించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదవేణీ మహేష్, బింగి వెంకటేష్, కస్తూరి లక్ష్మీనారాయణ, చిరుమల్ల ధనుంజయ్, గట్ల శివకుమార్, గంగుల రాజుకుమార్, అపార్ట్‌మెంట్ నివాస కులు గడ్డం మధు, గుంటుక ప్రసాద్ పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 19 : మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని గుట్టపైన గల లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి పురోహితులు మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, ఆలయశుద్ధితో పాటు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తొగిటి అంజయ్య, నూతుల రాజారెడ్డి, పురోహితులు నంబి గోపాలకృష్ణశర్మ, హనోహర్‌శర్మ, రాజేంద్రశర్మ, మౌలిశర్మ, గంగాప్రసాద్, రాజాగౌతమ్‌శర్మ, రాజేశ్వరశర్మ, శివరాంశర్మ, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

పెగడపల్లి, జనవరి 19 : యువత స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పెగడపల్లి తహసీల్దార్ ఎం.ఏ.ఫారూక్, ఎంపీడీవో జె.పుల్లయ్య పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆద్వర్యంలో పెగడపల్లి మండల కేంద్రంతో పాటు ఏడుమోటలపల్లి గ్రామాలలో స్వామి వివేకానంద 161వ జయంతిని పురస్కరించుకుని యువజన వారోత్సవాలలో భాగంగా వ్యాసరచన, వాలీబాల్ శుక్రవారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లో కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, ప్రిన్సిపాల్ సుంకరి రవి, గంగాధర్, పార్థసారథి, నర్సింహారెడ్డి, అనీల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

లారీల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలి

కలెక్టర్‌కు లారీ ఓనర్స్ వినతి

జగిత్యాల అర్బన్, జనవరి 19: జగిత్యాల మున్సిపల్ పరిధిలో లారీల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ జగిత్యాల లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు శుక్రవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల పరిధిలో సుమారు 200 లారీల వరకు ఉన్నాయని, కానీ వాటిని నిలిపేందుకు స్థలం లేకుండా పోయిందన్నారు. గతంలో ఉన్న స్థలంలో అమరుల స్థూపం, పార్కు నిర్మాణం చేయడంతో తాత్కాలికంగా స్థలం కేటాయించారన్నారు. ఇప్పుడు మామిడి సీజన్ ప్రారంభం కావడంతో పార్కింగ్‌కు మరింత ఇబ్బందిగా మారిందన్నారు. కావున సత్వరమే తమ సమస్య పరిష్కారం కోసం స్థలం కేటాయించగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ విద్యార్థులకు అభినందన

జగిత్యాల అర్బన్, జనవరి 19: యూనిఫైడ్ కౌన్సిల్ వారిచే జాతీయ స్థాయిలో నిర్వహించిన సైబర్ ఒలంపియాడ్ పరీక్షలో జాతీయ స్థాయి ర్యాంకులతోమానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు తెలిపారు. తమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా రజిత రావు మాట్లాడుతూ మానస స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయి ఒలంపియాడ్ పరీక్షల్లో కూడా రాణించడం సంతోషకరం అన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు

జగిత్యాల అర్బన్, జనవరి 19: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ బాధ్యులు ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ ప్రముఖ్ మురళి హాజరై క్రీడా పోటీలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద యువతకు ఆదర్శప్రాయులని, వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ బాధ్యులు రామకృష్ణ, లోకేష్ క్రీడాకారులున్నారు.

ఎంపీ అర్వింద్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

జగిత్యాల, జనవరి 19, (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైనా మోరపల్లి సత్యనారాయణరావు నిజామాబాద్‌లోని ఎంపీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తన నియామకానికి సహకరించినందుకు ఎంపీకి సత్యనారాయణరావు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జగిత్యాల రూరల్ మండలశాఖ బీజేపీ అధ్యక్షుడు నలువాల తిరుపతి ఉన్నారు.

విద్యుత్ శాఖలో కీలక పోస్టులు ఖాళీ

- అంతరాయాలను నివారించడంలో జాప్యం
- పోస్టులు భర్తీ కాక ఇబ్బందులు
- ప్రస్తుతం ఉన్న జేఎల్ఎంలపై పని ఒత్తిడి



కథలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్

కథలాపూర్, జనవరి 19 : విద్యుత్ శాఖలో కీలక పోస్టుల ఖాళీల కారణంగా పల్లెల్లో విద్యుత్ సంబంధిత సమస్యలు పేరుకుపోతున్నాయి. గ్రామస్థాయిలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేని కారణంగా ఎక్కడికక్కడ ఇబ్బందులు పరిష్కారానికి నోచుకోని పరిస్థితి తలెత్తింది. ప్రతీ సబ్‌స్టేషన్‌లో ముగ్గురు ఆపరేటర్లు ఉండాల్సి ఉండగా ఒకరు, ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఆపరేటర్లే హెల్పర్ (జేఎల్ఎం)గా పనులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. మరి కొన్ని గ్రామాల్లో జేఎల్ఎంలు ఆపరేటర్ల అవతారం ఎత్తాల్సిన దుస్థితి ఎదురవుతోంది.

● భర్తీకి నోచుకోని పోస్టులు

మండలంలో కథలాపూర్, అంబారిపేట రెండు సెక్షన్లుగా విభజించి ఎన్‌పీడీసీఎల్ విభాగం విద్యుత్ సరఫరా చేస్తోంది. అంబారిపేట సెక్షన్ కింద తాండ్రాల, గంభీర్‌పూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లు పనిచేస్తున్నాయి. ఈ సబ్‌స్టేషన్లలో ముగ్గురికిగాను కేవలం ఇద్దరు మాత్రమే ఆపరేటర్లు పనిచేస్తున్నారు. అదేవిధంగా ఇప్పపల్లి, పోతారం, కలికోట గ్రామాలకు ఒక్కరే జేఎల్ఎం ఉన్నారు. తాండ్రాల, అంబారిపేటకు కేవలం ఒక్కరే ఉన్నారు. దుంపెట, గంభీర్‌పూర్ గ్రామాల్లో జేఎల్ఎం పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అంబారిపేటకు లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టు భర్తీ కాలేదు. కథలాపూర్ సెక్షన్‌లో దూలూరులో జేఎల్ఎం, కథలాపూర్‌లో లైన్ ఇన్స్పెక్టర్, లైన్‌మెన్, సిరికొండలో జెఎల్ఎం, లైన్‌మెన్ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. చింతకుంట, బొమ్మెన సబ్‌స్టేషన్లలో ఆపరేటర్లు ఒక్కరు చొప్పున మాత్రమే పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో జేఎల్ఎంలు ఆపరేటర్‌గా పనిచేయడంతో పాటు గృహాలు, వ్యవసాయ బిల్లుల వసూళ్లు కూడా చేయాల్సి వస్తోంది. దీంతో పని ఒత్తిడి పెరుగుతోందని జేఎల్ఎంలు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై ఫీజులు వేయడం, వైర్లు తెగిన సందర్భాల్లో మరమ్మతులు చేయడంలో జాప్యం జరుగుతోందని రైతాంగం వాపోతున్నారు. మరో పక్క గృహాలకు మీటర్లు బిగించే పని కూడా జేఎల్ఎంలే చేయాల్సి ఉండడంతో తీవ్ర పని ఒత్తిడి పెరుగుతోందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఖాళీలు భర్తీ చేస్తే రైతులు, గృహ వినియోగదారులకు సకాలంలో సేవలు అందడానికి అస్కారం ఉంటుందని వినియోగదారులు పేర్కొంటున్నారు.

● ఖాళీలతో పనులకు కొంత ఆటంకం

జమీల్‌పాషా, ఏఈ కథలాపూర్

గ్రామస్థాయిలో జేఎల్ఎంలే విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయాలను సరిదిద్దుతారు. ఈ పోస్టులు ఖాళీగా ఉన్నందు వల్ల పనులకు ఆటంకం ఏర్పడుతోంది. ఎప్పటికప్పుడు ఖాళీల వివరాలు ఉన్నతాధికారులు నివేదిస్తుంటారు. జేఎల్ఎంలు బిల్లుల వసూళ్లు, ఫీల్డ్ వర్క్, కొన్ని సందర్భాల్లో సబ్‌స్టేషన్ ఆపరేటర్లుగా పనిచేయాల్సి వస్తోంది. ఖాళీలు భర్తీ చేస్తే పనులు సత్వరమే పూర్తికావడానికి అవకాశం ఏర్పడుతుంది.

చివరి ఆయకట్టుకు సాగు నీరు అందిస్తాం

●ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



నంది రిజర్వాయర్ వద్ద ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న అడ్లూరి

ధర్మారం, జనవరి 19: చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా శాశ్వత పరిష్కారం చేయనున్నట్టు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ధర్మారం మండలం నంది మేడారంలో గల కాళేశ్వరం ప్రాజెక్టులోని నంది రిజర్వాయర్‌ను ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ, కాళేశ్వరం నీటిని అందించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని ఈ నెల 6న సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారని ఆయన వివరించారు. ప్రధానంగా నంది రిజర్వాయర్ ద్వారా ధర్మారం, వెల్గటూర్ మండలాల్లోని రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఇరిగేషన్ అధి కారులకు సూచించారు. మల్లాపూర్ డి83/బి, కాళేశ్వరం సాగునీటిని విడుదల చేసేలా ప్రత్యామ్నయంగా ప్రణాళికలు తయారు చేయాలని ఆయన చెప్పారు. ఎల్లంపల్లి, కాళేశ్వరం నీటి నీటి సామర్థ్యం గురించి ఇరిగేషన్ అధికారులు ఆయనకు వివరించారు. ఆయన వెంట జగిత్యాల జిల్లా నీటిపారుదల శాఖ సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ నూనే శ్రీధర్, డీఈఈలు నర్సింగారావు, విష్ణు, ఏఈఈలు కార్తీక్ ఉన్నారు.

నంది రిజర్వాయర్ ద్వారా సాగునీటిని విడుదల చేయాలి

●వెల్గటూర్ మండల రైతుల వినతి

కాళేశ్వరం ప్రాజెక్టులోని నంది రిజర్వాయర్ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని శుక్రవారం వెల్గటూర్ మండలంలోని పది గ్రామాల రైతులు శుక్రవారం నందిమేడారంలో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు విన్నవించారు. సాగునీటిని విడుదల చేస్తారనే ఉద్దేశ్యంతో నార్లు పోసుకున్నామని వారు వివరించారు. సాగు చేస్తున్న పంటలు ఎండిపోకుండా ఇక్కడి నుంచి నీటి విడుదల చేస్తే పది గ్రామాల రైతులకు ఉపయోగపడుతుందని వారు విన్నవించారు. స్పందించిన అడ్లూరి నంది మేడారం నందిరిజర్వాయర్‌లో తూము వద్ద తాత్కాలికంగా నీటిని విడుదల చేశారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమయ్యేలా చూస్తానని లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు.

●నందిమేడారంలో ప్రభుత్వ హైస్కూల్‌ను శుక్రవారం మధ్యాహ్నం అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సందర్శించారు. విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య, పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని హైస్కూల్ హెచ్ఎం వసంత వివరించారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు.

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

వెల్గటూర్, జనవరి 19: ఉపాధ్యాయులు సమాజానికి మార్గ నిర్దేశకులని తహసీల్దార్ శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం వెల్గటూర్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నీలం సంపత్ మాట్లాడుతూ డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం వృత్తి నిబద్ధతతో విద్యా రంగంలోని అనేక సమస్యల పరిష్కారానికి నిరంతం పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ గంగాధర్, ఆర్ఐ రాజేశ్వరి, డీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాగర్, మహేష్, ఎండపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం, సతీష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోనె సత్తయ్య, విజయ్, రాజేశం పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కంపెనీలో ప్రవేశాల ఎంపిక

జగిత్యాల అర్బన్, జనవరి 19: వివిధ స్పోర్ట్స్ కంపెనీలలో ప్రవేశాలకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి డాక్టర్ కే. రవి కుమార్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (హైద్రాబాద్) వారి ఆదేశానుసారం బాక్సింగ్, హాకీ, స్విమ్మింగ్, సెయిలింగ్ తదితర క్రీడల్లో ఫిబ్రవరి 5 నుంచి 8వరకు కేంద్రీయ విశ్వవిద్యాలయం మద్రాస్, సెంటర్ స్పోర్ట్స్ గ్రౌండ్ బెంగుళూర్‌లో ప్రవేశాల ఎంపిక నిర్వహిస్తారన్నారు. ఈ ఎంపికకు 8నుంచి 14ఏళ్ల, 14 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు గల బాలురు అర్హులని తెలిపారు. కావున జిల్లాలోని విద్యార్థులు, క్రీడాకారుల తమ ఒరిజినల్ జనన ధృవీకరణ పత్రం, కుల, స్టడీ, రెసిడెన్సియల్, కండక్ట్ సర్టిఫికెట్, ఇండెమ్నిటీ బాండ్, ఆధార్‌కార్డు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, 6 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, కావల్సిన ఆట వస్తువులు తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు 9567345347 (స్విమ్మింగ్), 7892766021 (బాక్సింగ్), 70193977105 (సెయిలింగ్), 7204793183 (హాకీ) ఆయా క్రీడాకారులు నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చిన్నారులకు అన్నప్రాసన

మల్యాల, జనవరి 19: మండలంలోని మద్దుట్లలో గల అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యసం చేశారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం తప్పక తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశ్రీ, సర్పంచ్ మల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు స్వరూపరాణీ, అనురాధ, జలజ గ్రామస్తులు పాల్గొన్నారు..

వైభవంగా శ్రీరాముని పాదుకల ఊరేగింపు



రాముని పాదుకలు ఊరేగిస్తున్న భక్తులు

కొడిమ్యాల, జనవరి 19 : అయోధ్య రామ మందిరం నుంచి పాదయాత్ర చేస్తూ తీసుక వచ్చిన శ్రీరాముని పాదుకలను శుక్రవారం మండలంలోని పూడూర్, గౌరాపూర్, నర్సింహులపల్లి గ్రామాల్లో శ్రీరామ నామంతో భజన చేస్తూ వైభవంగా ఊరేగించారు. శ్రీరాముని పాదుకలను పూడూర్ గ్రామ మార్కండేయుని ఆలయం నుంచి ఊరేగింపుగా పూడూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి, పోచమ్మ, గౌరాపూర్ గ్రామంలో ఆంజనేయస్వామి, నర్సింహులపల్లి గ్రామంలో బోడకొండ నర్సింహస్వామి ఆలయం వరకు రామ భక్తులు ఊరేగింపుగా నెత్తిపై మోసుకొని వచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పూడూర్ గ్రామ నాయకుడు రవికుమార్, సింగిల్ విండో ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచు లింగారెడ్డి, పంచాయతీ సభ్యుడు కిరణ్, పద్మశాలీ సంఘం నాయకులు, లక్ష్మీపతి, సభ్యులు పాల్గొన్నారు.

● మండల కేంద్రంలోని పలువురి ఇళ్ల గోడలకు శుక్రవారం రామ భక్తులు గ్రామ ప్రముఖులు జై శ్రీరామ్ వేస్తున్నారు. రెండు రోజుల నుంచి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 22న అయోధ్య రామ మందిరంలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లను రామ భక్తులు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రాజేశం, రామ భక్తులు శ్రీనివాస్, దేవేందర్, రామ స్వామి, రాకేష్, చందు ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి

జగిత్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఆర్ఎస్పీ క్యాంపులో గల పోలీసు డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ వెంకటస్వామిని పలువురు శ్రీరామ సేవా సమితి సభ్యులు కలిసి శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ, పట్టాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రికను అందించారు. అయోధ్యలోని దివ్య శ్రీరామ మందిరంలో భవ్య బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పుర స్కరించుకొని జగిత్యాలలో ఈనెల 17వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శ్రీరామ సేవా సమితి ఆద్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వివరిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 21 వ తేదీన పట్టణంలో భక్త మార్కెండేయ దేవాలయం నుంచి శ్రీ కోదండ రామాలయం వరకు రామ భక్తులచే శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈసందర్భంగా డీఎస్పీ వెంకటస్వామి మాట్లాడారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వల్ల బహుళ ప్రయోజనాలు అందుతాయన్నారు. ఈకార్యక్రమంలో పలువురు శ్రీరా సేవా సమితి సభ్యులు, రామ దీక్షా భక్తులు పాల్గొన్నారు.



డీఎస్పీ వెంకటస్వామికి ఆహ్వాన పత్రం అందిస్తున్న రామ భక్తులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి, జనవరి, 19 : మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు కోరుట్ల ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, భోజనశాల, స్టోర్ రూమ్‌లతో పాటు తరగది, హాస్టల్ గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావలని, విద్యార్థులకు ప్రతి రోజు మెన్ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో మున్సిపల్ కార్మికుల పాత్ర కీలకం

మెట్‌పల్లి : పట్టణాభివృద్ధిలో మున్సిపల్ కార్మికుల పాత్ర కీలకమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మున్సిపల్ పారిశుధ్యం కార్మికులు మహాలక్ష్మి అమ్మ వారికి బోనాల పండుగను నిర్వహించారు. కార్మికులు భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బోనాలతో మున్సిపల్ కార్యాలయం నుంచి శోభయాత్రను నిర్వహించారు. కార్మికులు బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. బోనం అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ పాల్గొని కార్మికులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, అక్షయ్, కౌన్సిలర్లు బంగారుకాళ్ళ కిషోర్, అంగడి పురుషోత్తం, అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

●విద్యుత్ షాక్‌తో మరణించిన వారి కుటుంబ సభ్యులకు శాఖ అందించిన ఎక్స్‌గ్రేషియా చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు భూసేకరణపై గ్రామ సభ

కొడిమ్యాల, జనవరి 19 : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం జాతీయ రహదారి 563 నిర్మాణంలో బాగంగా భూసేకరణపైన గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికాంత్ శుక్రవారం తెలిపారు. ఈ గ్రామ సభకు భూసేకరణ అధికారి, జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి వస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పూడూర్, నాచుపల్లి, గౌరాపూర్, నమిలికొండ గ్రామాలలోని రైతులు, ప్రజలు హాజరు కావాలని తహసీల్దారు కోరారు.

విద్యార్థుల అల్పాహారానికి విరాళం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 19 : మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అల్పాహారం కోసం పూర్వ విద్యార్థి అమ్ముల రాహుల్ విరాళం అందజేశారు. శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చుదువుతున్న విద్యార్థులకు 40 రోజులు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించడానికి రూ. 6వేల నగదును విరళంగా అందజేశాడు. ఈ కార్యక్రమంలో బైరి మచ్చేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

కొడిమ్యాల, జనవరి 19 : ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కొడిమ్యాల ఎస్సై కె. వెంకట్‌రావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని నమిలికొండ గ్రామంలో రాత్రి సైబర్ మోసాలపై జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాలతో పోలీస్ కళా బృందం సభ్యులు కమల్, రమేష్, సత్తయ్య, సతీష్, కాంతయ్య, డప్పు లక్ష్మన్, హన్మంతు పాటలతో ప్రజలకు అవగాహన కలిపించారు. కొడిమ్యాల ఎస్సై వెంకట్‌రావు మాట్లాడుతూ సీసీ కెమెరాల ఆవశ్యకతను, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు నివారణపై అవగాహన కలిపించారు. ఈ అవగాహన సభలో గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కొడిమ్యాల, జనవరి 19 : మండలంలోని నల్లగొండ, గౌరాపూర్ గ్రామాల్లో శుక్రవారం వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. ఈ గ్రామ సభలలో వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్.ఎల్.సీ మధుసూధన్ వేర్వేరుగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంత అర్హులైన ప్రజలకు మరింత చేరువ చేసెందుకు నిర్వహిస్తున్న కార్యక్రమమే వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర అన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలకు అందరు దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ కార్డు కోసం అందరు నమోదు చేసుకొని ఉచితంగా కార్పోరేట్ ఆసుపత్రులలో 10లక్షల రూపాయల వరకు వైద్య సేవలు పొందాలన్నారు. ఈ గ్రామ సభలలో సర్పంచులు మల్లేశం, విజయలక్ష్మీరమేష్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుధారాణి, కార్యదర్శులు, పోస్టల్ అధికారి శారద, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామానికి చేరుకున్న సంకల్ప యాత్ర

గొల్లపల్లి, జనవరి 19: ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాబోవు రోజుల్లో అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుందని ధర్మపురి నియోజకవర్గ అంబాసిడర్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంకల్పించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి శుక్రవారం చేరుకుంది. ఆయన మాట్లాడుతూ 21వ శతాబ్ధంలో దేశానికి అవసరమైన ఆర్థిక సంస్కరణల వేగవంతం ఫలితమే ప్రపంచంలో ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందన్నారు. వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, సర్పంచ్ సిద్ధెంకి నర్స య్య, ఉప సర్పంచ్ బేర కిషోర్, దాసరి మల్లయ్య, భీమ మహేష్, నరేష్, శ్రీధర్, రవి, బాలయ్య, లచ్చన్న పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కోరుట్ల రూరల్, జనవరి 19 : మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన పంతంగి ఈశ్వరి కుటుంబానికి శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ బీమా చెక్కును అందించారు. పంతంగి ఈశ్వరి కొన్ని రోజుల క్రితం వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ షాక్‌తో మరణించగా ప్రభుత్వం అందించిన రూ. 5లక్షల బీమా చెక్కును ఈశ్వరి కుటుంబ సభ్యులకు ఎమ్మెలే అందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి చెక్కును అందించారు. గంథ్రాలయ సంస్థ జిల్లా మాజీ డైరెక్టర్ సురేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ప్రణీత రాజేందర్, హనుమాండ్లు, అధికారులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక

జగిత్యాల అర్బన్, జనవరి 19: పట్టణంలోని జ్యోతి ఐఐటీ హై స్కూల్ విద్యార్థులే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌కి ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్ రావు తెలిపారు. ఈ నెల 20,21 తేదీలలో హైదరా బాద్ లోని ఎల్బీ స్టేడియంలో జరిగే పోటీలలో 6వ తరగతికి చెందిన సహస్ర, ఐదో తరగతికి చెందిన విష్ణువర్ధిని, అర్బా ఫిర్దోస్‌లు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రాయికల్, జనవరి 19: రాయికల్ మండలంలోని అల్లీపూర్, కిష్టంపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ శుక్రవా రం పరిశీలించారు. అలాగే హరితహారం పనులు, నర్సరీ నిర్వహణ తదితర పనులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మా, సర్పంచ్, కార్యదర్శులు పాల్గొన్నారు.